www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శనివారం 18 మార్చి 2023

పేద ముస్లిం కుటుంబానికి ఎంపీపీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన షేక్ చోటు కొంతకాలంగా అనారోగ్యంతో (కిడ్నీ సమస్యతో) బాధపడుతుండగా విషయం తెలుసుకున్న ఎంపీపీ గంగ్రత్ రమేష్ రూ.5వేల ఆర్థిక సాయం చేశాడు. ఆర్థిక సాయం చేసి ఉదారత చాటుకున్న రమేష్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



821 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 30 కేంద్రాల్లో పరీక్షలు కొనసాగుతుండగా శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 821 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ వెల్లడించారు. మొత్తం 10, 828 మందికిగాను 10, 007 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

ఇంద్రవెల్లి : ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షలో మొత్తం 346 విద్యార్థులకుగాను 240 మంది హాజరయ్యారు. 106 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రాథోడ్ శ్రావణ్ నాయక్ తెలిపారు.

గ్రూపు పోరు..మారని తీరు..!

- భట్టి యాత్రలో బహిర్గతమైన లుకలుకలు
- ప్రాధాన్యం ఇవ్వడం లేదని అగ్రనేతలకు ఓ వర్గం ఫిర్యాదు
- ఇచ్చోడ సభలో అసంతృప్తి వెళ్లగక్కిన కార్యకర్తలు
- పీపుల్స్ మార్చ్‌కు మహేశ్వర్‌రెడ్డి దూరంపైనా చర్చ

పదేండ్లు ప్రతిపక్షంలో ఉన్నా కాంగ్రెస్ పార్టీ వర్గపోరును మాత్రం వీడటం లేదు. ఓ వైపు అధికారంలోకి వచ్చేందుకు అగ్రనేతలు ప్రయత్నాలు చేస్తుంటే..స్థానిక నాయకులు మాత్రం ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రకు కొనసాగింపుగా తాజాగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క జిల్లాలో ప్రారంభించిన పాదయాత్రలో ఈ వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. ఇచ్చోడలో గురువారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బోథ్ నియోజకవర్గానికి చెందిన ఓ వర్గం కార్యకర్తలు బాహాటంగానే తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. తమ నాయకుడికి సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో పాటు భట్టి విక్రమార్క పాల్గొన్న సభలోనే వాదనకు దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతం నుంచి రెండు వర్గాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ అంతగా బయటపడిన సందర్భాలు లేవు. నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. తాజాగా నిర్వహించిన సభలో ఈ విభేదాలు బహిర్గతమవడం చర్చనీయాంశంగా మారింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్‌కు ఎవరూ నష్టం చేయాల్సిన అవసరం లేదు.. వారికి వారే నష్టం చేసుకుంటారనే ప్రచారం ఉంది. తాజాగా పరిస్థితులు చూస్తే ఈ నానుడి నిజమేననిపిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పది నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీలో గ్రూపుల బెడద కొనసాగుతోంది. పార్టీ టికెట్ దక్కించుకునేందుకు ఎవరికి వారు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించడం.. అగ్రనేతలు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భాల్లోనూ బల ప్రదర్శనకు దిగడం పరిపాటిగా మారిందనే అభిప్రాయం ఉంది. తాజాగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి నుంచి జోడో యాత్రకు కొనసాగింపుగా పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్ర ప్రారంభించారు. బోథ్ నియోజకవర్గం నుంచి శ్రీకారం చుట్టిన ఈ యాత్రలో తొలి రోజే కార్యకర్తల మధ్య విభేదాలు పొడచూపడం చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లాలో కొన్నేండ్ల నుంచి ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఆయా నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్న వారిలో ఇరువురికి మద్దతు దారులు ఉన్నారు. ఈ రెండు వర్గాలకు చెందిన స్థానిక నాయకులు ఎవరికి వారు విడిపోయి పార్టీ టికెట్ దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో వర్గపోరుకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

సభలోనే అసంతృప్తి..!

ఇచ్చోడలో తొలిరోజున నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లోనే కార్యకర్తలు అసంతృప్తి వెళ్లగక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది. పీపుల్స్ మార్చ్ యాత్రను మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అన్ని తానై నిర్వహణ బాధ్యతలు చూసుకోవడం, ఆయన వర్గానికి చెందిన బోథ్ నియోజకవర్గ నాయకుడు వన్నెల అశోక్‌కు సభలో మాట్లాడే అవకాశం కల్పించారు. దీంతో మహేశ్వర్‌రెడ్డి వర్గానికి చెందిన ఈ నియోజకవర్గ నాయకుడు ఆడె గజేందర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో ఈయన మద్దతు దారులు నిరసన తెలుపడం చర్చనీయాంశమైంది. చివరకు అగ్రనేతలు జోక్యం చేసుకొని గజేందర్‌ను మాట్లాడించడంతో వివాదం సద్దుమణిగింది.మరోపక్క పీపుల్స్ మార్చ్ యాత్రలో స్థానిక నాయకులకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా తమ వర్గానికి సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే సభ జరిగిన రోజున ఉదయం జిల్లా కేంద్రానికి వచ్చిన మాణిక్‌రావ్ ఠాక్రేకు ఆడె గజేందర్ వర్గీయులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇలా ఆయా నియోజకవర్గాల్లో పార్టీలో గ్రూపుల బెడద కారణంగా పార్టీని నమ్ముకొని నిబద్ధతతో పనిచేస్తున్న కార్యకర్తల్లోనూ అసంతృప్తికి దారి తీస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క ఉమ్మడి జిల్లాలో కీలక నాయకుడిగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి పీపుల్స్ మార్చ్ యాత్రలో పాల్గొనకపోవడం పార్టీ కార్యకర్తల్లో చర్చకు దారితీసింది. ఈ యాత్రకు ఎందుకు దూరంగా ఉన్నారనే విషయమై అంతుబట్టడం లేదని కొందరు నాయకులు చెబుతున్నారు.



సమసిపోతేనే ప్రయోజనం..?

ఉమ్మడి జిల్లాలో భట్టి విక్రమార్క 13రోజుల పాటు పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ యాత్రలో అందరినీ కలుపుకొని వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.ప్రస్తుతం ఈ యాత్రలో నియోజకవర్గాల్లో రెండు వర్గాలకు చెందిన పార్టీ టికెట్లు ఆశిస్తున్న నాయకులు పాల్గొంటున్నారు. కానీ ఎవరికి వారు తమ ఆధిపత్యం కోసం ప్రయత్నాలు చేస్తుండటంతో స్థానిక కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. తాము ఎవరి పక్షాన వెళ్లాలో తెలియక సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలను ఎదుర్కొని నిలబడాలంటే ముందుగా కాంగ్రెస్ నాయకులు ఏకతాటిపై రావాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. అప్పుడే ఈ రెండు పార్టీలను ఎదుర్కొని నిలబడగలమనే విశ్వాసం వారిలో వ్యక్తమవుతోంది. పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ ఉన్నా.. గ్రూపు రాజకీయాలు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయని ఆ పార్టీ కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో గ్రూపు రాజకీయాలను విడనాడి ఒక్కటిగా ఉంటేనే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సత్తా చాటే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తెలంగాణలో ఆలయాలకు మహర్దశ : మంత్రి అల్లోల



నవతెలంగాణ-దిలావర్‌పూర్

పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ ఆలయాలకు మహర్దశ కల్పించారని దేవాదాయ, న్యాయ, అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండంపల్లి గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో పున:నిర్మించిన శ్రీ బీరప్ప(మల్లన్న) స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆలయాల అభివృద్ధికి ఎల్లవేళలా కృషిచేస్తానని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి పదవిని చేపట్టడం వల్లే జిల్లాలో ఎన్నో ఆలయాలకు నిధులు విడుదల చేసి అభివృద్ధి చేసుకోగల్గుతున్నామని తెలిపారు. గుండంపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.36లక్షలు, రాజ గోపురానికి రూ.45లక్షలు, హనుమాన్ ఆలయాలకు రూ.30లక్షలు, భీమన్న ఆలయానికి రూ.10లక్షలు మంజూరు చేశామని తెలిపారు. మల్లన్న ఆలయానికి రూ.5లక్షలు కాంపౌండ్ వాల్‌కు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం రూ.50లక్షల నిధుతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తక్కల రమణారెడ్డి, ఎంపిపి పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ తక్కల సంగీత, ఎంపిటిసి ఏలాల అమృత చిన్నారెడ్డి, బిఆర్ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ కరీం, ఏఓ స్రవంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్ఎస్ నాయకులు పాకాల రాంచందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన మాణిక్‌రావ్ ఠాక్రే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రాంచంద్రారెడ్డిని కలిశారు. సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేపడుతున్న పాదయాత్రలో భాగంగా జిల్లాకు వచ్చిన మాణిక్‌రావు ఠాక్రే మాజీ మంత్రి ఇంటికి గురువారం రాత్రి వచ్చి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రాంచంద్రారెడ్డి మాణిక్ రావు ఠాక్రేను శాలువాతో సత్కరించారు. అనంతరం ఇరువురు కాసేపు పార్టీ వ్యవహారాలపై చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేష్ జాదవ్, సంజీవ్‌రెడ్డి, అంబకంటి అశోక్, సంజయ్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

నవతెలంగాణ-ఉట్నూర్

మనుషుల జీవన మనుగడకు మొక్కలు చాలా అవసరమని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఘన్పూర్‌లో నాటిన మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం వల్ల అడవుల శాతంను పెంచే దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా నాయకులు, అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు పోయాలని, ఇందుకోసం ప్రతి శుక్రవారం డ్రై డేగా తీసుకున్నామన్నారు. అనంతరం డంపింగ్ యార్డ్, వర్మి కంపోస్టులను పరిశీలించారు. ఎంపీపీ వెంట పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

తంతోలి గ్రామపంచాయతీ పరిధిలో సొసైటీ గూడలో గురువారం క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్లకు ఎంపీపీ గంగ్రత్ రమేష్ బహుమతులు ప్రదానం చేశారు. జోగు ఫౌండేషన్ తరుపున రూ.15వేలు చిట్యాలబోరి టీంకు అందజేశారు. ద్వితీయ బహుమతి ఎంపీటీసీ సెవ్వ లక్ష్మిజగదీశ్ యాదవ్ రూ.10వేలు కస్తాల రామకృష్ణ టీంకు అందజేశారు. తృతీయ బహుమతి ఎఎంసీ డైరెక్టర్ పిరంగి మల్లేష్ రూ.5వేలు సొసైటీగూడ టీంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్, చిట్యాలబోరి సర్పంచ్ లక్ష్మి వసంత్, తంతోలి గ్రామ పటేల్ లక్కురామ్, గ్రామస్థులు అరవింద్, మశ్చందర్ పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం బీఆర్ఎస్‌కు చెంపపెట్టు

ఆదిలాబాద్‌టౌన్ : హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థి ఏవిఎన్ రెడ్డి ఘన విజయం సాధించడం బీఆర్ఎస్‌కు చెంపపెట్టు లాంటిదని ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఈ మేరకు ఢిల్లీ నుండి మీడియాకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. పట్టభద్రులు, మేధావులు, నిరుద్యోగుల నుండి బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకత ఎదురవుతోందని తెలిపారు. రాష్ట్రంలో పేపర్ లీకేజ్‌ల వెనుక బీఆర్ఎస్ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరో వైపు కేసీఆర్ కూతురు కవిత ఈడీ విచారణకు దుమ్మా కొడుతూ లిక్కర్ స్కాం నుండి తప్పించుకునేలా జిమ్మిక్కులు చేస్తోందని విమర్శించారు.

23న జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ మతోన్మాద, కార్పోరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ దేశ సంక్షేమం, మత సామరస్యం, సామాజిక న్యాయం కోసం 23న నిర్వహించే జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య భవనంలో పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23న ఉదయం 11గంటలకు ఆర్అండ్‌బి అతిథి గృహ మైదానంలో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అంతకు ముందు ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు పట్టణంలోని ప్రధాన చౌక్‌ల గుండా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. జనచైతన్య యాత్రను ప్రారంభించడానికి పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు వస్తారని చెప్పారు. అలాగే యాత్ర రథసారధిగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య వక్తలుగా బండారు రవికుమార్, పి.జయక్ష్మి , స్కైలాబ్ బాబు పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్. మంజుల పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే సిలిండర్



నవతెలంగాణ-ఇచ్చోడ

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రూ.400కే సిలిండర్ ఉంటే నరేంద్రమోదీ ప్రభుత్వంలో రూ.1250కు చేరిందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సిలిండర్ ధర రూ.500కే అందిస్తామని సీఎల్పీ నేత బట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం రెండో రోజు విక్రమార్క పాదయాత్ర ఇచ్చోడ నుంచి సిరికొండ వరకు కొనసాగింది. దూపార్‌పేట్, పట్వారి గూడెం, మాదాపూర్, పొన్న, రాయిగూడ, సుంకిడి, జాకీర్‌గూడ మీదుగా సిరికొండకు మొత్తం 17 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలు పాదయాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి వీర తిలకం దిద్ది తమ మద్దతు తెలిపారు. విద్యార్థులు, యువకులు, రైతులు, కూలీలు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొన్నారు.

అభివాదం చేస్తూ..సమస్యలు ఆలకిస్తూ..

రెండో రోజు చేపట్టిన భట్టి విక్రమార్క తన పాదయాత్రలో ప్రజలకు ఆప్యాయంగా అభివాదం చేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చోడ బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన చెప్పులు కుడుతున్న కార్మికుని వద్దకు వెళ్లి ఆయన సమస్యలు అడిగారు. 9వ తరగతి వరకు చదువుకున్న తనకు ఎలాంటి ఉపాధి అవకాశం లేకపోవడంతో రోడ్డు పక్కన ఇలా చెప్పులు కుడుతూ కుటుంబాన్ని సాకుతున్నానని వెల్లడించాడు. ప్రభుత్వం నుంచి ఏమైనా సాయం అందిందా అని అడగగా ఇప్పటివరకు తనకు ఎలాంటి సహకారం అందలేదని, ఉండడానికి కూడా సొంత ఇల్లు లేదని తన పరిస్థితిని తెలిపాడు. ప్రభుత్వం ముద్ర లోన్ ఇస్తుంది కదా అని సీఎల్పీ నేత భట్టి ఆయనను అడుడగా ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకున్నా తనకు రాలేదని కార్మికుడు బాలాజీ ఈశ్వర్ ముకుంద్ చెప్పారు. బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లతో భట్టి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరల వల్ల తమకు ఎలాంటి గిట్టుబాటు కావడం లేదని, రోజువారి కూలీ కూడా రావడం లేదని ఆటో డ్రైవర్లు తమ బాధలను వెలిబుచ్చారు. రోడ్డు వక్కన కూరగాయలు అమ్ముతున్న షేక్ మొహిష్ పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్కకు ఎదురొచ్చి తన దుకాణం వద్దకు తీసుకువెళ్లి తన ధీన పరిస్థితిని చూపించాడు. దూపార్‌పేట్ గ్రామానికి చేరుకున్న భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు ప్రజలు ఎదురొచ్చి స్వాగతం పలికి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. భారీ వర్షం వచ్చినప్పుడు 200గృహాలున్న ఈ గ్రామం పూర్తిగా వరదలతో మునిగిపోతుందని చెప్పారు. సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామన్న పేరిట అధికారులు ఫంక్షన్ హాల్‌లో పెట్టి తిండి కూడా సరిగ్గా పెట్టరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి అందాల్సిన పునరావాస సహాయం కూడా అందలేదని గ్రామానికి చెందిన రుక్మిణి, ములుగుబాయి, అనసూయ, అమృత బాధలను చెప్పుకున్నారు. పట్వారిగూడెంలో శిథిలమైన ప్రాథమిక పాఠశాలను భట్టి విక్రమార్క సందర్శించారు. అధ్వాన స్థితిలో ఉన్న పాఠశాలను చూసిన ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. మాదాపూర్ గ్రామానికి చెందిన ముత్తవ్వ, చిన్నయ్య పాదయాత్రకు వస్తున్న భట్టి విక్రమార్కకు ఎదురొచ్చి పశువుల కొట్టం కంటే అధ్వానంగా ఉన్న తమ రేకుల ఇండ్లను చూపించి విలపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు దరఖాస్తు పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మీలాంటి వాళ్ల ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని చెప్పడంతో వారు కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పాదయాత్రలో పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, వన్నెల అశోక్, గంగ్రత్ సుజాత, ఆడే గజేందర్, మండల అధ్యక్షులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే గత హామీలు అమలు కావాలి

- ఎస్‌కేఎంయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి



నవతెలంగాణ-జైపూర్

కార్మికులు కార్మిక సంఘాలను ఆదరించాలంటే గతంలో ఆర్ఎల్‌సీ వద్ద జరిగిన ఒప్పందాలు అమలు పర్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఐకే-1ఏ గని ఆవరణలో బ్రాంచ్ అధ్యక్షులు మీడువల్లి శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలు కాకుండా సమస్యలు పరిష్కరించకుండా కార్మిక సంఘం ఎన్నికలు కావాలంటున్న నాయకులు హామీల అమలు పట్ల కార్మికులు నిలదీస్తే ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రెండు ఓట్ల సిద్ధాంతంపై వివరణ ఇస్తూ ఏరియాల పరిధిలో పరిష్కారమయ్యే సమస్యల కొరకు ఏరియా పరిధికి ఒక ఓటు, సింగరేణి స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు సింగరేణి వ్యాప్తంగా ఒక ఓటు వేసినప్పుడు మాత్రమే ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. 2011లో అలవెన్స్‌పై ఐటీ మాఫీ ఒప్పందం ఇప్పటి వరకు గెలిచిన సంఘాలు అమలు కాలేదు. యాజమాన్యం అధికారులకు అమలు చేస్తూ కార్మికులకు ఆర్థిక నష్టాన్ని మిగుల్చుతుందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన కార్మిక గుర్తింపు సంఘం కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం ఇచ్చే సీఎంపీఎఫ్ చిట్టీలు కూడా సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల పేరుతో కార్మిక సంఘాల మధ్య చిచ్చుపెట్టి కార్మికులు యూనియన్ల వారిగా విడిపోతుంటే యాజమాన్యం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. కోవిడ్ పేరుతో ఫ్లేడేలు తగ్గించిన, ఉత్పత్తి నెలలో ఇచ్చే స్పెషల్ ఇన్సెంటివ్ సైతం ఎగవేసిన యాజమాన్యం సేఫ్టీ పేరుతో హెల్మెట్‌పై కార్మికులను ఇబ్బందుల పాలు చేస్తుందని విమ్మర్శించారు. ప్రతిపక్ష యూనియన్లను నిర్వీర్యం చేసేందుకు కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను మార్చడానికి కొన్ని యూనియన్లు గెలుపుపై ధీమాతో ఒప్పుకోవడం లేదన్నారు. ఇప్పటికే సీఐటీయూగా సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు క్వార్టర్ ఉంటే ఎక్కువ ఇన్కమ్‌టాక్స్ పడుతున్నదని అవగాహన కల్పిస్తూ ఎవరి క్వార్టర్ వారికే కేటాయించాలని, క్వార్టర్ లేని కార్మికులకు 250 గజాల స్థలం ఇవ్వాలని నిరవధిక దీక్ష సైతం చేస్తామని, తప్పనిసరిగా కార్మికులకు సొంత ఇంటి కల అమలు చేసేలా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి సాధిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, డివిజన్ ఆర్గనైజనర్ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు బోడకుంట శంకర్, వెంకటేశ్వర్లు, వెంగళ శ్రీనివాస్, ఆర్‌జీ-1 కార్యదర్శి మెండ శ్రీనివాస్, గౌస్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి గిరిజన క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు



నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు శుక్రవారం కేబీ కాంప్లెక్స్ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడా పాఠశాలల గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. రెండు సంవత్సరాలు కరోనాతో కొన్ని ఇబ్బందులు ఎదురైన వాటిని అధిగమించి ఈ ఏడాది జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఐటీడీఏ పీఓ, డిప్యూటీ డైరెక్టర్ క్రీడా పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం క్రీడాకారులకు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలలో గిరిజన విద్యార్థులు ముందుండాలన్నారు. అనుభవం కలిగిన కోచ్‌లతో శిక్షణ, ఉత్తమ విద్యా భోదన, పౌష్టికాహారం అందిస్తున్నందున క్రీడా పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసీఎంఓ జగన్, గిరిజన క్రీడల అధికారి పార్ధ సారధి, ప్రధానోపాధ్యాయులు రాథోడ్ ఉత్తమ్, పీడీలు లక్ష్మణ్ పవార్, మధుమాధన్, శ్రీనివాస్, రవీందర్, జయవంత్ రావు, ఆర్. గణేష్, రాములు, కోచ్ లు సునంద్, లక్ష్మి రామ్, శివ, శేఖర్, కార్తీ, పిఎంఆర్సి గోవింద్‌రావు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మహిళలు కుట్టుమిషన్‌లతో స్వయం ఉపాధి పొందాలని మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో మహిళల కోసం ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ ఉద్యోగంపై ఆధార పడకుండా స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఇందులో భాగంగానే మహిళల కోసం మండల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆరంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కండ్లద్దాల పంపిణీ

నవతెలంగాణ-కడెం



మండలంలోని దస్తురాబాద్ పీహెచ్‌సీ పరిధిలోని ఉడుంపూర్ గ్రామంలో ఇటీవల కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించి, వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి రోగులకు ప్రభుత్వం నుండి మంజూరైన ఉచిత కంటి అద్దాలను శుక్రవారం దస్తురాబాద్ పీహెచ్‌సీ, హెచ్ఈఓ వేణుగోపాల్ 51మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎంలు గంగామణి, రత్నమాల, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఆశా వర్కర్ లలిత, వీఆర్ఏ రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ లేని సిగరెట్ ప్యాకెట్లు అమ్మకూడదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మార్పీ లేని సిగరెట్ ప్యాకెట్లు అమ్మడం నేరమని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నో స్మోకింగ్, క్యాన్సర్ బొమ్మలతో కూడిన హెచ్చరిక లేని పొగాకు ఉత్పత్తుల అమ్మకం చట్టవిరుద్ధమని అన్నారు. నో స్మోకింగ్, బహిరంగ ధూమపానం నేరం అని రాసి ఉన్న హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట సామాజిక కార్యకర్త చిరంజీవి ఉన్నారు.



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన డీపీఓ



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

డీపీఓగా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న శ్రీలత శుక్రవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పంచాయతీ అధికారి ఇన్‌చార్జీగా కొనసాగిన ఆమె పదోన్నతి పొంది పూర్తి బాధ్యతలు తీసుకుంది. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధిపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజగంగన్నలతో పాటు మండలంలోని ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పలు శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కడెం

మండలంలోని ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు అమరగుండ మల్లేష్ కుమారుడి వివాహ వేడుకకు శుక్రవారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖాశ్యామ్ నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి కానుకను అందజేశారు. అనంతరం నవాబ్‌పేట్ గ్రామంలోని జిల్ల శంకరయ్య నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై శంకరయ్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన అంకం లావణ్య నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడి నుండి ఉడుంపూర్ గ్రామానికి చెందిన మెంగాని శ్రీనివాస్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతాల్‌కార్ అరవింద్ అన్నారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుబీర్ మండల వ్యాప్తంగా ఆన్ లైన్ లొకేషన్‌లో ఉపాధ్యాయులు ఉండటం లేదని అన్నారు. మండల విద్యాధికారి నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సుభాష్ అనే ఉపాధ్యాయుడు కొన్ని రోజులుగా పాఠశాలకు రావడం లేదని అన్నారు. ఆన్‌లైన్ లొకేషన్ పెట్టి స్వంత పనులు చేసుకుంటున్నారని అన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పేద విద్యార్థులకు బాధ్యతగా చదువులు చెప్పాల్సిన వారు విధులను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. మండల వ్యాప్తంగా పాఠశాలలో ఇటువంటి నిర్లక్ష్యం జరుగుతుందని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్, ఆర్జేడీ విద్యాశాఖ కమిషనర్‌కు దృష్టికి తీసుకొని వెళ్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్ ఉన్నారు.

వ్యాపార సముదాయాల ప్రారంభం



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. యజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధిలో నిర్మల్ పట్టణం ముందుకెళ్తుందని అన్నారు. పట్టణంలో అన్ని రకాలుగా వ్యాపార సముదాయలు ఏర్పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, లక్కాకుల నరహరి, తౌహీద్ ఉద్దీన్ రప్పు, ఏడిపెల్లి నరేందర్, ఆకుల రామకృష్ణ, దేవరకోట ఆలయ చైర్మెన్ లింగంపల్లి లక్ష్మీ నారాయణ, గొనె రాజు, డైరెక్టర్ పద్మనాభం, పూదరి శివ, భూపతి, నాయకులు పాల్గొన్నారు.

బియ్యం గోడౌన్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-భైంసా



ముధోల్ మండల కేంద్రమైన ముధోల్‌లోని పౌరసరఫరాల బియ్యం గోడౌన్‌ను శుక్రవారం నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న బియ్యాన్ని, రికార్డులను పరిశీలించారు. పలు వివరాలను గోడౌన్ ఇన్‌చార్జీని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట పౌరసరఫరాల జిల్లా డిఎం శశికళ, ఆర్ఐ అభిమాన్యు, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ ఉన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్ అన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సొంత స్థలం ఉన్న పేదలందరికి ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం ద్వారా ఇచ్చే డబ్బులు సరిపోవని అన్నారు. సిమెంటు, ఇసుక, ఇటుక, ఇనుము ఇతర అన్నిరకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. గృహలక్ష్మి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు భరించి మొత్తం రూ.15లక్షలు ఇవ్వాలని అన్నారు. జీఓ నెంబర్ 58ని వెంటనే అమలు చేసి, రాష్ట్రంలో పేదలు వేసుకున్న గుడిసెలకు, ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతి నిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కలిసి జిల్లాలో ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి అమ్ముకున్నారని, వాటికి పట్టాలు ఇవ్వవద్దని అన్నారు. కొంత మంది భూమాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మల్ చుట్టూ పక్కల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, వాటికి 59 జీఓ ద్వారా క్రమబద్ధీకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్‌లు, రేషన్ కార్డులు అంటూ ఆర్భాటంగా ఎన్నికల సందర్భంగా వాగ్దానాలివ్వటం, వచ్చాక వాటిని విస్మరించడం జరుగుతుందని విమర్శించారు. సమావేశంలో పట్టణ కమిటీ కార్యదర్శి ఎస్.అరవింద్, కమిటీ సభ్యులు అదిక్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ముఖ్య ఎజెండా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-లోకేశ్వరం

రాష్ట్రంలోని నిరుపేదల ఆరోగ్యానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసి చేయూత నందిస్తుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్దిదారులకు మండల నాయకులతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అభివృద్ధి చేయని విధంగా పేదరిక నిర్మూలనే ముఖ్య ఎజెండాగా ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతు బీమా, సీఎంఆర్ఎఫ్ తదితర రకాల సంక్షేమ పథకాలను రూపొందించి, ఆరోగ్య రక్షణ, అభివృద్ధికి పాటుపడుతున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మెన్ లోలం శ్యామ్‌సుందర్, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్ రావు, సర్పంచ్‌లు నర్సింగ్ రావు, సరస్వతి భీంరావు, ఎర్రవ్వ దిగంబర్, నరేష్, సాయన్న, ఎల్లన్న, భుజంగ్ రావు, ఎంపీటీసీ లు సాయిరెడ్డి, దత్తు, సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, సీనియర్ నాయకులు గంగయ్య, నర్సింగ్ రావు, బలరాం, ఆంజనేయులు, భోజన్న, సీనియర్ నాయకులు దిలీప్, ఆనంద్ రావు పటేల్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-నిర్మల్



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రజాసంఘాల ఐక్య వేదిక కార్యాలయంలో సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల, రైతులు, రైతు కూలీల సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రోజు రూ.600 కూలి చెల్లించాలని అన్నారు. సంవత్సరానికి ఉపాధి పని దినాలు 200 వందల రోజులు కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అలాగే నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. నరేంద్ర మోడీ సర్కార్ రెండుసార్లు అధికారంలోకి వచ్చి ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. రైతులకు వ్యవసాయ కూలీలకు తీవ్ర నష్టం చేసిందని అన్నారు. పేదల కడుపు కొట్టి కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇచ్చి సంపన్నులకు రూ.17 లక్షల కోట్ల బకాయిలను రద్దు చేసిందని విమర్శించారు. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికి కూడా పట్టా ఇవ్వలేదని అన్నారు. గిరిజన, గిరిజనేతర రైతులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5 నాడు జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు, హాజరై జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగెల్లి నర్సయ్య పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. ఇటీవల కాలంలో గుండె సంబంధ సమస్యలతో మరణాలు సంభవిస్తున్నాయని, తక్షణం వైద్య సేవలు అందించేందుకు హృదయ శ్వాస కోశ పునరుజ్జీవన చర్యపై ప్రజలందరికి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. శుక్రవారం రిమ్స్‌లోని సమావేశ మందిరంలో సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయస్సు నిమిత్తం లేకుండా గుండె సంబంధ సమస్యలతో మరణాలు సంభవిస్తున్నాయని, హృదయ శ్వాస కోశ పునరుజ్జీవన చర్య ద్వారా దీనికి తక్షణ ఉపశమనం కలిగించవచ్చని అన్నారు. ఇట్టి విధానంపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పోలీస్, మెడికల్, సానిటేషన్, తదితర ఫ్రంట్ లైన్ వారియర్స్ సిబ్బంది ప్రజలతో కలిసి ఉంటారనీ వారందరికీ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండేందుకు ప్రభుత్వం అన్ని వర్గాల వారికీ క్షేత్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా మొదట పోలీస్, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తదుపరి మున్సిపల్, పంచాయతీ, ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వంటి స్థాయి సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందిస్తామని అన్నారు. శిక్షణ పొందిన వారి వివరాలు నమోదు చేసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. డాక్టర్లు తెలిపిన ప్రకారంగా అత్యవసర సమయాల్లో సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా, ఆరోగ్యం, వ్యవసాయం ముఖ్యమని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు చేరుకోవడం ద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. గుండె సంబంధ సమస్యలు 88 శాతం ఇండ్లలోనే జరుగుతాయని అన్నారు. సీపీఆర్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆపత్కాలంలో సహకారం అందించాలని అన్నారు. అంతకుముందు ప్రోగ్రాం ఆఫీసర్ డా. మనోహర్ మాట్లాడుతూ దశల వారిగా జిల్లాలోని అన్ని వర్గాల వారికీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వీడియో స్క్రీనింగ్, ప్రత్యేక్ష శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్లు చంద్రశేఖర్, స్వామి, వంశీ, హరీష్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పర్యవేక్షకులు డా.అశోక్, ఇద్రీస్ అక్బాని, ట్రాఫిక్ ఎస్సై అప్పారావు, మెడికోలు, ట్రాఫిక్ పోలీసులు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం :ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతుందని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ నెల వారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా జరిగిన నేరాలపై సమీక్ష, నమోదైన కేసుల పురోగతి, వర్టికల్స్, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, ఎన్‌బి డబ్ల్యూ, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం మొదటి నుండి జిల్లా పోలీసులు జిల్లాలో జరిగిన ప్రమాదాలపై సమీక్షలు జరిపి గణనీయంగా ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తూ ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారని తెలియజేశారు. ప్రతిరోజు సాయంత్రం సమయంలో హైవేలపై, పట్టణాల్లో గ్రామాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ముఖ్యంగా ద్విచక్ర వాహనాల రోడ్డు ప్రమాదాలను తగ్గించారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇతర రాష్ట్రాలతో సరిహద్దును పంచుకుంటున్నందున సరిహద్దు పోలీస్‌స్టేషన్‌లో పకడ్బందీగా గస్తీ నిర్వహిస్తూ, రాత్రివేళల మరింత అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామీణాన్ని సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుంటూ, సీసీటీవీ కెమెరాలు, డయల్ 100 ప్రాముఖ్యత, ప్రస్తుతం సైబర్ నేరస్తులు అవలంబిస్తున్న నూతన పద్ధతులను ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు పరిపాలన ఎస్ శ్రీనివాసరావు, ఓఎస్డి బి.రాములు నాయక్, డీటీసీ సి.సమయ్ జాన్ రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, పోతారం శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్బి, ఐటీ కోడ్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఉల్వజీ హైమావతి రాజు ప్రారంభించారు. 17 తేదీ నుండి 23 వరకు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీఓ నసీరుద్దీన్, గ్రామస్తులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 23 మంది క్రీడాకారుల ఎంపిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

12న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన 23 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో క్రీడాకారుల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ల రాజేష్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ప్రారంభం కానున్న రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పేటా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి క్రీడా శిక్షకులు వీజీఎస్ రాకేష్ పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో స్తంభాలను తొలగించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

బీటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మధ్యలోనే ఉండిపోయిన స్తంభాలను తొలగించాలని మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రేఖా నాయక్ ఆదేశాల మేరకు స్తంభాల తొలగింపు విషయంలో ఖానాపూర్‌కు వచ్చిన విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహాన్‌తో కలిసి స్తంభాలను పరిశీలించారు. మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల వాహనాలకు అంతరాయం కలుగుతుందని అన్నారు. స్తంభాల తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇంజనీర్ తిరుపతి, విద్యుత్ శాఖ డీఈ నాగరాజు, ఏఈ తిరుపతి, ఏడీఈ శెట్టి శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ వెంకటేష్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పరీక్ష కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-గుడిహత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నటరాజన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా గదులలో తిరుగుతూ, పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా సీసీ ఫుటేజీని పరిశీలిస్తూ, ప్రశ్న పత్రాలను నిర్ణీత సమయానికే తెరిచారా, నిబంధనలను పాటించారా లేదా అన్న అంశాలను గమనించారు. అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచుతూ ప్రశాంతంగా పరీక్షలు నిర్వహిస్తుండటంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట లెనిన్ బాబు, మాధవి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-గుడిహత్నూర్

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ టి.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లలో మరమ్మత్తుల కారణంగా పలు చోట్ల అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మరమ్మత్తుల కారణంగా గ్రామాల్లో ఉదయం 11 గంటల గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. గుడిహత్నూర్, తోషం, ధామన్ గూడ, డోంగర్‌గావ్, కోల్హారి, ముత్నూర్ గ్రామాల పరిధీలో విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు.

ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు అస్వస్థత



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో గురువారం సాయంత్రం 8 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయ సిబ్బంది మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు, మెరుగైన చికిత్స కోసం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులు తీసుకున్న ఆహారం, తాగిన నీటి శాంపిల్స్ సేకరించి పరీక్ష నిమిత్తం పంపినట్లు వైద్యులు తెలిపారు. అస్వస్థతకు కారణాలు ఇప్పుడే చెప్పలేమని వైద్యులు తెలిపారు. అదేవిధంగా శుక్రవారం పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యురాలు రాజమణి వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు పరీక్షించారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. మొత్తం 11 మంది విద్యార్థినులకు క్యాల్షియం తక్కువ ఉన్నట్లు హెచ్ఈఓ నాందేవ్ పేర్కొన్నారు.

నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
శనివారం 18 మార్చి 2023

స్వయం ఉపాధి పొందేవారికి అండగా ఉంటాం

- ఎమ్మెల్యే రేఖా నాయక్

నవతెలంగాణ-జన్నారం

స్వశక్తితో స్వయం ఉపాధి చేసుకునే యువతకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో యువకులు స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న రెస్టారెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువతను ప్రోత్సహించడానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. స్వయం ఉపాధి చేసుకునే వారికి స్కిల్ డెవలప్మెంట్ పథకం కింద ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి శుభకార్యాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఫీజుల పేరట పిల్లలను వేధిస్తే చట్టరిత్య చర్యలు

నవతెలంగాణ-చింతలమానెపల్లి

సకాలంలో స్కూలు పిజులు చెల్లించాడం లేదని స్కూలు యాజమాన్యం పిల్లలను మానసికంగా వేదిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా బలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ అన్నారు. రవీంద్రనగర్‌లోని శ్రీనికేతన్ పాఠశాలలో ఫీజులు చెల్లించడం లేదని విద్యార్థిని దండించిన విషయం వార్త పత్రికలలో ప్రచురితం కావడంతో శుక్రవారం పాఠశాలను సందర్శించి తల్లిదండ్రులు వారి పిల్లలతో మాట్లడి విషయం తెలుసుకున్నారు. పాఠశాల యాజమాన్యన్ని తీవ్రంగా హెచ్చరించి బాలల హక్కులు రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉదన్నారు. ఫీజుల పేరట పిల్లలను దండించడం బలాల హక్కుల ఉల్లంఘనగా పరిగణించి జూవైలియన్ జస్టిస్ యాక్ట్ 2015 సెక్షన్ 82 ప్రకారం సంబంధిత పాఠశాల యజమాన్యం పైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నూతన అటవీ అధికారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా అటవీ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్‌ను మొదటి సారి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అడవుల సంరక్షణకు సంబంధించి పోలీసుల సహాయ సహకారాల అవసరాని ఆయనకు వివరించారు. అడవుల సంరక్షణలో సహకరించాలని ఎస్పీని కోరగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ డీఎఫ్ఓకు తెలిపారు.

డీఎఫ్ఓతో భేటీ అయిన ఎమ్మెల్యే

జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రీవాల్‌తో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డీఎఫ్ఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అంశాలను అటవీ శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో పోడు భూముల సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేతోపాటు ఎఫ్డీవో విజయ్ కుమార్, సక్కు యూత్ ఫోర్స్ అధ్యక్షుడు ఆత్రం వినోద్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని లింగనపేట గ్రామంలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ దాగమ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాగమ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకొని కంటి సమస్యల నుంచి విముక్తి పొందటానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ కంటి పరీక్షలు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ కంటి పరీక్షలు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోటపల్లి వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు హాజరయ్యారు.

తహసీల్దార్ కార్యాలయానికి రోడ్డు వేయాలి

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని తాసీల్దార్, ఎంపీడీవో, వెలుగు, కార్యాలయాలకు వెళ్లే రహదారి పూర్తిగా చెడిపోయిందని వెంటనే ఆ రోడ్డును వేయాలని పొన్కల్ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఆ రోడ్డు పూర్తిగా గుంతల మయమై వాహనాలు కూడా నడిచే పరిస్థితి లేదన్నారు. 108 వాహనం కూడా తొందరగా వెళ్లే అవకాశం దన్నారు. తాసీల్దార్ ఎంపీడీఓ వెలుగు కార్యాలయాలకు వెళ్లే వారితో ఆ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డును వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కడారుల నరసయ్య, ముత్యం భాస్కర్, నరసయ్య, శ్రీనివాస్ అన్నారు.

ఆహార పంటల సాగుకు మొగ్గు చూపాలి



నవతెలంగాణ-తాండూర్

రైతులు వాణిజ్య పంటలతో పాటు ఆహార పంటలపై దృష్టి సారించాలని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ తెలిపారు. శుక్రవారం మండలంలోని కిష్టంపేట, కొత్తపల్లి, రేచీని రైతువేదికలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం కింద మినుము విత్తనాల మినీ కిట్లను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు వాణిజ్య పరంగా పంటలు పండించి ఆర్థికంగా ఎదుగుతూ చిన్నపాటి వ్యవసాయ క్షేత్రాల్లో ఆహార పంటలు పండించి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మినుము, పెసరి, కంది పంటలు వేయడం వల్ల భూమిలో నత్రజని శాతం స్థిరీకరించబడి భూసారం పెరుగుతుందని తెలిపారు. ఆహార పంటలైన జొన్న, మొక్కజొన్న, పెసరి కంది పంటలకు తక్కువ పెట్టుబడి ఖర్చు ఉంటుందని తెలిపారు. అధిక ప్రోటీన్లు ఫైబర్ గల అహార పంటలను నిత్యజీవితంలో వినియోగించడం వల్ల ఆరోగ్యం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మామిడి పంటలను పరిశీలించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఏఈఓ శంకర్, పుష్ప, ధనలక్ష్మి ఉన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో వేసవికాలం దృష్ట్యా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ సరిత, ఎస్సై విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ప్రయాణికుల దాహర్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దూగుంట రాజన్న, పోతపెల్లి సర్పంచ్ చంద్రమౌళి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

వీఓఏల వంటావార్పు

- కాంగ్రెస్ సంఘీభావం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాగజ్‌నగర్‌లోని ఐకేపీ కార్యాలయం ముందు వంటావార్పు చేపట్టారు. వీరి నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు గురువారం నుండి దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెల్సిందే. ఇందులో భాగంగా శుక్రవారం వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో

వెలుగు చూసిన అక్రమాలు

- ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక

నవతెలంగాణ-తాండూర్



ఎంపీడీఓ కార్యాయంలో శుక్రవారం డీఆర్‌డీఓ శేషాద్రి ఆధ్వర్యంలో ఉపాధి హామీ 13వ సామాజిక తనిఖీలో అక్రమాలు వెలుగుచూశాయి. ఈ ప్రజా వేదికలో పలు అభివృద్ధికి సంబంధించిన ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోనికి వచ్చాయి. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మార్చి 2020 నుండి మార్చి 2022 వరకు చేపట్టిన అభివృద్ధి పనుల విషయాలను ప్రజా వేదికలో చర్చించారు. మొత్తం మూడు సంవత్సరాల అభివృద్ధి పనులకు రూ.9.19 కోట్లతో ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పనులు చేపట్టారు. మండలంలో పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్లలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు నిధుల ఖర్చులను చూపిస్తున్నప్పటికీ మండలంలోని మొత్తం పంచాయితీలలో సరాసరి 50 శాతం మొక్కలు మాత్రమే బతికినట్లు తేలింది. గ్రామపంచాయతీలలోని ఎంపీడబ్ల్యూలు కూలి చేసినట్లు మాస్టర్లు వేసుకొని నిధులను కాజేసినట్లు రుజువయింది. గ్రామపంచాయతీలో కార్యదర్శులు సెవెన్ రిజిస్టర్లను నిర్వహించడం లేదని తేలింది. ఎక్కువ గ్రామపంచాయతీలలో తీర్మానాలు లేకుండానే పనులు నిర్వహించినట్లు సోషల్ ఆడిటర్లు తేల్చారు. నర్సరీలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను ఆదాయ వ్యయాల రిజిస్టర్‌లను నిర్వహించడం లేదు. కొన్ని పంచాయితీల టిఏలు మెజర్మెంట్ పుస్తకాలను సోషియా ఆడిట్ అధికారులకు ఇయ్యలేదు. 15 గ్రామపంచాయతీలో పంచాయతీరాజ్ ఫారెస్ట్ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల ఎంబీలు లేకపోవడంతో అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ జరగలేదు. కొన్ని పంచాయతీలలో జరిగిన పనులలో నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో అధికారులకు రికవరీ రాశారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలు మరుగుదొడ్ల నిర్మాణాల విషయంలో కొన్ని పంచాయితీలలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. ఈ ప్రజా వేదికలో అదనపు డీఆర్‌డీఓ దత్తరావు ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ సాలిగామ బానయ్య, అంబుడ్స్ మాన్ శివరాం, ఎస్‌క్యూసీఓ చంద్రశేఖర్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏపీఓ నందకుమార్, ఈసీ సత్యనారాయణ, టీఏ రమేష్, లక్ష్మి, సుష్మ, ఎస్టీఎం నరేందర్, ఎస్ఆర్పీ కొమురయ్య పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక

నవతెలంగాణ-మంచిర్యాల



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం ద్వారా ఇల్లు లేని పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంచిర్యాల నియోజకవర్గం పరిధిలోని ఇండ్ల కేటాయింపు మొదటి దశలో 330 మంది లబ్దిదారులను లాటరీ పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. శుక్రవారం జిల్లాలోని వేంపల్లిలోని పద్మావతి గార్డెన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసేందుకు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. మధుసూదన్ నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, డీసీపీ శ్రీధర్ రాంనాథ్ కేకన్లతో కలిసి లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం మీ సేవ ద్వారా 2 వేల 958 దరఖాస్తులు రాగా, వివిధ స్థాయిలో విచారించి 1 వేయి 616 మందిని అర్హులుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. లాటరీ ద్వారా రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగుల కేటగిరీలో 53 దరఖాస్తులు రాగా, 5 శాతంతో 16 మంది, షెడ్యూల్ తెగల కేటగిరీలో 31 దరఖాస్తులలో 6 శాతంతో 20 మంది, షెడ్యూల్ కులాల కాటగిరీలో 221 దరఖాస్తులు రాగా, 17 శాతంతో 36 మంది, మైనార్టీ కాటగిరీలో 94 దరఖాస్తులు రాగా 12 శాతంతో 39 మందిని, ఇతరులు (వెనుకబడిన తరగతులను కలుపుకొని) కేటగిరీలో వేయి దరఖాస్తులు 199 మంది లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 5 శాతం రిజర్వేషన్ కలిగిన దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ ఇండ్లను కేటాయించడం జరిగిందని, కేటగిరీ, రిజర్వేషన్ల వారిగా ఎంపిక అనంతరం మిగిలిన అందరు లబ్దిదారులను జనరల్ కేటగిరీలో ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తం 660 ఇండ్లు మంజూరు కాగా 30 ఇండ్లను భూములు కోల్పోయిన వారికి అందించడం జరిగిందని, మొదటి దశలో 330 మందికి రిజర్వేషన్ల ప్రాతిపదికన లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని, మిగతావి త్వరలోనే పూర్తి చేసి లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి వివిధ స్థాయిలలో 99.9 శాతం విచారణ అనంతరం లబ్దిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. లాటరీ ప్రక్రియ అనంతరం జిల్లా అధికారుల విచారణలో ఎంపికైన లబ్దిదారులలో ఎవరైనా అనర్హులుగా నిర్ధారణ అయినట్లయితే కేటాయింపును రద్దు చేస్తూ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్‌డీఓ వేణు, తహసీల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ రాజు పాల్గొన్నారు.

మీడియాకు అవకాశం లేదు

లబ్దిదారుల ఎంపిక విధానం విషయంలో అధికారులు అనుసరించిన తీరు విమర్శలకు దారితీసింది. టోకెన్ ఉన్నవారికి మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ మీడియాకు మాత్రం అనుమతి నిరాకరించడం గమనార్హం. మున్సిపల్ ప్రజా ప్రతినిధులకు కూడా అనుమతి లేదు అని చెప్పడం విమర్శలకు దారి తీసింది.

వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-వేమనపల్లి



స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోళి స్వర్ణలత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సాధారణ సర్వ సభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. అధికారులు ప్రజాప్రతినిధులు ఆలస్యంగా రావడంతో గంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. అధికారులు అభివృద్ధి నివేదిక చదివి వినిపించారు. ముఖ్యంగా వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ సక్రమంగా రావడం లేదని డీసీఎంఎస్ కేంద్రంలో యూరియా, డీఏపి ఎక్కువ రేటుకు అమ్ముతున్నారని ఎంపీటీసీ బాపు నిలదీయగా తమ దష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. అలాగే సమావేశంకు హాజరు కానీ పలు శాఖ అధికారులపై చర్యలు ఉంటాయని ఎంపీడీఓ సమావేశంలో వెల్లడించారు. ఎంపీపీ కోళి స్వర్ణలత మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలపై అధికారులు చిత్త శుద్ధితో పని చేయలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, ఎంపీటీసీలు అదే చంద్రకళ, దాగామ బాపు, కోఆప్షన్ సభ్యులు జహెద్ అలీ, సర్పంచులు మధుకర్, కొండగొర్ల బాపు, జెల్ల మొండి, మండల స్థాయిఅధికారులు ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఎంఈఓ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రాజ్ కుమార్, ఏఈఈ నరేష్, ఏటిడబ్లుఓ చిరంజీవి, పశువైద్యాధికారి అరుణ రాజేష్, ఇన్‌ఛార్జి ఏఓ విజయ కుమార్, ఏపీఎం ఉమారాణీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, రజిత, విద్యుత్ శాఖ ఏఈఈ దీక్షిత్, ఏపీఓ సత్యప్రసాద్, హార్టికల్చర్ సుప్రజా, ఇరిగేషన్ రజాలింగు పాల్గొన్నారు.

ఆర్కే-8 డిస్పెన్సరిని సందర్శించిన అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-8 డిస్పెన్సరీని డీఎంఎస్(మెడికల్) డాక్టర్ జాన్ జార్జి, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాన్ జార్జి మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమైనవని, ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో ఇకముందు కూడా ఇదే ధోరణి కొనసాగించాలని సూచించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న పీఎంఈ డాక్టర్లు అందరూ అసోసియేటెడ్ ఫెలో ఇండస్ట్రియల్ హెల్త్ సర్టిఫైడ్ డాక్టర్లని వీరందరూ సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణలో ఎల్లవేళలా పనిచేయడం చాలా సంతోషకరమైన విషయమని గుర్తు చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల మార్పు వలన ప్రతి ఒక్క ఉద్యోగి తగు ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, ఉద్యోగులకు ఎవరికైనా దీర్ఘకాల వ్యాధులు ఉంటే వారు క్రమం తప్పకుండా వైద్యశాలకు వచ్చి డాక్టర్లను సంప్రదిస్తూ ఉండాలని, సంబంధిత మందులను వాడుతూ ఉండాలని సూచించారు. త్వరలో ఫిజియోథెరపీ విభాగాన్ని డిస్పెన్సరీలో ప్రారంభించుకోవడం జరుగుతుందని, దీనిని శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్లు, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్యశాలలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, ఇన్‌ఛార్జి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ మురళీధర్, వేదవ్యాసు, స్వప్న, డిప్యూటీ సూపరింటెండెంట్ ముత్తయ్య పాల్గొన్నారు.

భూ కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రభుత్వ భూ కబ్జాలు చేస్తూ అక్రమ వెంచర్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 15 మండలాలలో భూదందా ప్రజా ప్రతినిధులు, అధికారుల కనుసన్నల్లో జోరుగా కొనసాగుతోందన్నారు. జిల్లాలో భూ అక్రమ వెంచర్లు వేసుకొని కొంతమంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా ఇనాం భూములు ప్రభుత్వ భూములని చూడకుండా అక్రమ వెంచర్లు వేసుకొని అనుమతులు తీసుకోకుండా లేఅవుట్లు లేకుండా భూదంద కొనసాగిస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద గల ప్రభుత్వ భూమి, పక్కనే ఉన్న ఇనాం భూములు కూడా బాండ్ పేపర్ల ద్వారా రూ.లక్షల్లో వ్యాపారం కొనసాగిస్తున్నారని అన్నారు. వీటిపై చర్యలు తీసుకుని కబ్జాదారుల హస్తాల నుండి భూములు రక్షించాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, గెడం టీకానంద్, చాపిడి పురుషోత్తం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పత్తి దగ్ధం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని అంక్సాపూర్ గ్రామపంచాయతీ గొల్లగూడలో గురువారం రాత్రి అగ్ని ప్రాదంలో ఇంట్లో నిలువ చేసిన పత్తి పంట దగ్ధమయ్యింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లగూడలో నివాసం ఉంటున్న పెర్సుంగుల పోషన్న బంధువుల పెండ్లికి ఇంట్లో వారితో కలిసి వెళ్లాడు. అర్ధరాత్రి ఇంట్లో నుండి పొగలు రావడంతో గమనించిన చుట్టుపక్కల వారు పోచన్నకు సమాచారం అందించడంతో వెంటనే ఇంటి వద్దకు చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో ఉన్న పత్తి మంట అంటుకోవడంతో బిందెలతో ఆర్పడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారు వచ్చినప్పటికీ సంఘటన స్థలం వద్దకు చేరుకోవడానికి రహదారి లేకపోవడంతో ఆస్తి నష్టం జరిగింది. పత్తితో పాటు షెడ్డు కూడా కాలిపోవడంతో రూ.రెండు లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగిందని తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

పంట మార్పిడితోనే అధిక దిగుబడి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పంట మార్పిడితోనే అధిక దిగుబడి వస్తుందని కాగజ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కడంబా, గన్నారం, ఆరెగూడ గ్రామాల్లో రైతులకు పంటల మార్పిడిపై అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ అర్హులైన రైతులందరు చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ డబ్బులు పడని రైతులు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. వేసవి దుక్కులు సిద్ధం చేసుకోవాలని, వేసవి దుక్కుల వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శైలేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు గడువు పెంపు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదోతరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు తేదీని ఈ నెల 20వ తేదీ వరకు పొడగించినట్టు ఆసిఫాబాద్ డీసీఓ పోలోజు బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల ప్రకారం ఐదోతరగతి ప్రవేశ పరీక్ష గడువు సాంఘీక సంక్షేమ గురుకుల సొసైటీ ప్రవేశ పరీక్ష మార్చి 5వ తేదీతో ముగిసినప్పటికీ అధికారులు తిరిగి గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్టు ఆయన తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉద్యోగులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేత

నవతెలంగాణ-నస్పూర్

జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2021-22 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన సీఎంపీఎఫ్ చిట్టీలను జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సీఎంపిఎఫ్ చిట్టీలను ఆయా సంబంధిత గనుల విభాగాల వారికి పంపించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి, సీనియర్ పీఓ పి.కాంతారావు, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ కార్యాలయ కార్యదర్శి పీవీ రావు, ఆకుల అఖిల పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

నవతెలంగాణ-నస్పూర్

కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకం అయిన 47 మంది యువతీ, యువకులకు బి.సంజీవరెడ్డి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. సింగరేణిలో రెండవ తరానికి ఉద్యోగాలు రావడం మీ అదృష్టంగా భావించాలని అన్నారు. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్, (ఐఏఎస్) దిశానిర్దేశంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రగతిపథంలో వెళ్తుందని దానికి అనుగుణంగా ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం నాయకులు దేవేందర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ మటేటి వెంకట రాజయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఈ నెల 18న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. జిఎస్‌నగర్ 33/11 కెవి ఉపకేంద్రం మరమ్మత్తులు చేపడుతున్న దృష్ట్యా మండలంలోని రాంపూర్, పొచ్చెర, దిమ్మ, జందాపూర్, భీంసరి గ్రామాలలో ఉదయం 11 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

కౌటాల : మండలంలోని గుండాయిపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటలకు సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ లైన్ మరమ్మత్తులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా హాఫీజే ఖురాన్ జల్సా

నవతెలంగాణ-దిలావర్‌పూర్



నర్సాపూర్(జి) మండల కేంద్రంలో దారులుం మహమ్మదీయాలో శనివారం ఘనంగా హాఫీజే ఖురాన్ జల్సా నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు చదువు పూర్తి చేసుకున్న హాఫిజ్‌ని పూలమాలలు, శాలువాలు కప్పి అభినందించారు. ఈ సమావేశానికి మత పెద్దలు, మత గురువులు, గ్రామ పెద్దలు, ముస్లింలు హాజరయ్యారు. కార్యక్రమంలో జక్కిబాయ్, ఆబిద్‌ఖాన్, తఖీఉల్లఖాన్, రైస్‌ఖాన్, సికందర్, జమీల్, ఫసి, సలీం, మజర్, సదర్ హఫీజ్, సయ్యద్ ఇర్ఫాన్, హఫీజ్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండల కేంద్రంలో మసీద్ వద్ద రూ.20 లక్షలతో వ్యాపార సముదాయాల నిర్మాణానికి, రూ.10 లక్షలతో కబ్రస్తాన్ ప్రహరీ గోడ పనులకు ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళుతోందని అన్నారు. ముస్లిం మైనారిటీల మసీదుల అభివృద్ధికి, ఇతర పనులకు రూ.17 కోట్లతో పనులు చేపడుతున్నామని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని అన్నారు. అందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ పార్టీ నాయకులపై ఈడీ లాంటి సంస్థలను ఉసిగొల్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, జెడ్పీటీసీ నల్ల వనిత, మైనారిటీ కమీషన్ సభ్యులు అత్తరుల్లా, సర్పంచ్ దొగ్గలి ప్రమీల, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, సాజిదొద్దీన్, నాయకులు నల్ల రాజేశ్వర్, ఏవన్, డి.రాజేశ్వర్, గంగుల కిరణ్, మహేందర్, ఆసిఫ్, అజీమ్, హబీబ్, ఉమాకాంత్‌రెడ్డి, విజయ్, సుధీర్, భీమన్న గంగయ్య, అభిమాన్, ప్రదీప్, సృజన్, నారాయణ, రాజన్న, సంతోష్, గంగన్న పాల్గొన్నారు.

జామా మసీద్ అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలో ప్రసిద్ధిగాంచిన జామా మసీద్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జోగు రామన్న రూ.2 కోట్లు మంజూరు చేసి, నిర్మాణ పనులకు, సంబంధించిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. శుక్రవారం జామా మసీద్ సభ్యులు మైనార్టీ మత పెద్దలతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మసీదులో మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మసీదుల అభివృద్ధికి రూ. 17 కోట్ల కేటాయించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, మైనార్టీ నాయకులు సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

సాయుధ పోలీసు సిబ్బందితో ఎస్పీ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సాయుధ పోలీసు సిబ్బంది సమస్యలపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది తెలిపిన సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. సిబ్బందికి పిల్లల భవిష్యత్తుపై సరైన ప్రణాళికను ఏర్పాటు చేసుకొని వాటిని అవలంబించాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా ఉద్యోగంలో చేరిన సిబ్బందికి పదవీ విరమణ అనంతరం వచ్చే ప్రయోజనాలను నేటి నుండి ప్రభుత్వ ప్రయివేటు పథకాలలో చేరి భవిష్యత్తుకు చక్కటి మార్గాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. అదేవిధంగా సిబ్బందికి హెల్త్ స్కీమ్స్‌లపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సాయుధ దళంలో విధులు నిర్వర్తిస్తున్న 250 మంది సిబ్బందికి గత మూడు సంవత్సరాలుగా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు నాటిన మామిడి మొక్కల సంరక్షణ పూర్తి బాధ్యతలు అప్పగించారు. హెడ్ క్వాటర్స్‌లో నాటిన ప్రతి మొక్క ప్రతి ఒక్క సిబ్బందికి అప్పగించడం జరిగిందని తెలిపారు. సిబ్బంది సర్వీసులో ఉన్నంత కాలం మొక్క సంరక్షణ బాధ్యతలు నిర్వర్తించాలని అదేవిధంగా వాటి ప్రతిఫలాన్ని కూడా పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్ శ్రీనివాసరావు, సి సమయ్ జాన్ రావు, బి రాములు నాయక్, డీఎస్పీలు వి.ఉమేందర్, ఉమామహేశ్వరరావు, పోతారం శ్రీనివాస్, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు, సీఐలు, ఎస్సైలు జిల్లా పోలీసు సిబ్బంది రిజర్వు సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని సాత్‌గాం గ్రామంలో శుక్రవారం శ్రీఅడెల్లి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మెన్ లోలం శ్యామ్‌సుందర్, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్ రావు, సర్పంచ్ లక్ష్మి ముత్తన్న, ఎంపీటీసీ సాయిరెడ్డి, బిలోలి సర్పంచ్‌లు నర్సింగ్ రావు, హద్గాం సర్పంచ్ సరస్వతి భీంరావు, జోహర్పూర్ సర్పంచ్ ఎర్రవ్వ దిగంబర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, సీనియర్ నాయకులు దిలీప్, ఆనంద్ రావు పటిల్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 8 మంది విద్యార్థుల గైర్హాజరు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో శుక్రవారం మొదటి సంవత్సరం రెండో రోజు కొనసాగిన ఇంటర్ పరీక్షలో 292 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, అందులో 8 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్ పేర్కొన్నారు.

గిరి వికాసం పథకం గిరిజనులకు వరం

నవతెలంగాణ-భీమారం

రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఉపాధి భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో ముఖ్య మంత్రి గిరి వికాస పథకం పారంభించిందని సర్పంచ్ గద్దె రాంరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో గిరి వికాస పథకం ద్వారా వ్యవసాయ బోరు బావి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గిరిజన రైతులకు ఉపాధి భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంలో స్థానిక గిరిజన రైతులను సమన్వయం చేస్తూ పంటల సాగుకు గిరి వికాసం పథకం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 100 శాతం సబ్సిడీపై బోరు బావులను ఏర్పాటు చేసి రైతులను స్వశక్తిగా ఎదిగేలా ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ. సతీష్ రెడ్డి, ఏపీఓ జీనత్, ఈసీ శ్రీనివాస్, టిఏ శరత్, వాటర్ షెడ్ టీఏ రమాదేవి, జియాలజిస్ట్ స్వామి పాల్గొన్నారు.

తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాలి

- ప్రభుత్వాలను ప్రశ్నిస్తే కక్ష్యసాధింపు చర్యలు సిగ్గుచేటు
- అధికార పార్టీపై నిప్పులు చెరిగిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ-సిరికొండ

రాష్ట్రంలో తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న పీపుల్స్ పాదయాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది. మొదటగా కుమురంభీమ్ చౌక్‌లోని ధ్వజ స్తంభానికి, గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో మాట్లాడారు. సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణను కొందరు పాలకులు దోపిడీకి పాల్పడుతున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరైందని కాదని పేర్కొన్నారు. బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల గూడు కోసం ఇచ్చినటువంటి ఇందిరమ్మ ఇండ్లు తప్ప డబుల్ బెడ్ రూం ఇండ్లు లేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి అధికార పార్టీ నాయకులు ఓర్వలేక పోతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, సిలిండర్ ధరలను తగ్గిస్తామని



అన్నారు. మండల కేంద్రంలో పలు సమస్యలను నాయకులు విన్నవించగా, అధికారంలోకి వచ్చాక ప్రతి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చిక్మాన్ ప్రాజెక్ట్ ఎత్తును పెంచి రైతుల కష్టాలను తీరుస్తామని అన్నారు. మండల కేంద్రం ఏర్పడి 7సంవత్సరాలు కావస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు. మండలంలో పిహెచ్‌సి లేకపోవడం సిగ్గుచేటన్నారు. అధిక శాతం గిరిజనులున్న మండలంలో ప్రజారోగ్యం పట్ల అధికార పార్టీకి ఎంత ప్రేమ ఉందో ప్రజలు గమనించాలని కోరారు. అనంతరం కొండాపూర్ గ్రామానికి చేరుకున్న పాదయాత్రకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఉదయం ఏడు గంటలకు తిరిగి యాత్ర ప్రారంభమై ఇంద్రవెల్లి మండలానికి చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, పీసీసీ మెంబర్ వెన్నెల అశోక్, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, నాయకులు రంజాన్, కంచం లక్ష్మణ్, బొడ్డు నవీన్, మాధవ్ పటేల్ పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల టోకెన్ సమ్మె కొనసాగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిమాండ్లు పరిష్కరించాలని ఐకెపి వివోఏలు చేస్తున్న టోకెన్ సమ్మె రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా అధ్యక్షురాలు చందేకర్ జ్యోతి, మండల అధ్యక్ష, కార్యదర్శులు బుద్ధ కీర్తి, రమ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. సెర్ప్ నుండి ఐడెంటి కార్డులు ఇవ్వాలని, బీమా సౌకర్యం రూ.10లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇవ్వాలని, నేరుగా సెర్ప్ నుంచి వేతనాలను నిర్ణయించి వివోఎల బ్యాంక్ అకౌంట్లో



ఆసిఫాబాద్‌లో...



కౌటాలలో...

ప్రతినెల మొదటివారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమాదేవి, శ్రీలక్ష్మి, గందే సునీత, ఫైమా, సుదర్శన్, శంకర్, సుధీర్, గణేష్ , జైవాంత్, సంజీవ్, వినోద్, మహేష్, శారద, రమాదేవి, శ్రీలత, లక్ష్మి, అమత, జయ, పద్మ, సురేఖ, అర్చన, జ్యోతి, కవిత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కౌటాల : టోకెన్ సమ్మెలో భాగంగా ఐకేపీ వీఓఏలు నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నస్రుల్లాఖాన్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల మండలాధ్యక్షులు వెంకటేశ్,జిల్లా ఉపాధ్యక్షుడు ఎలుములె దత్తు, రవి, భీంరావు, కొండయ్య, అశోక్, శంకర్, మహేశ్వరి, ఆనంద, ఇందు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు అభినందనీయం

నవతెలంగాణ - కౌటాల

దాతల సహకారంతో నిరుపేద కుటుంబాలకు చెందిన ఏడుగురు పేదింటి బిడ్డలకు సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని తలోడి గ్రామానికి చెందిన బీమదేవర ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో ఏడు జంటలకు పెళ్లిళ్లు జరిపించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేదింటి బిడ్డల పెళ్లిళ్ల కోసం దాతలు ముందుకొచ్చి సామూహిక వివాహాలు ప్రతి గ్రామంలో జరిగేలా చూడాలని కోరారు. నూతన వధూవరులను ఎమ్మెల్యే దంపతులు కోనేరు కోనప్ప-రమాదేవి ఆశీర్వదించారు. వారికి పట్టువస్త్రాలు కానుకగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, మన్నెవార్, కొలావార్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోశం, మన్నెవార్, కొలావార్ వ్యవస్థాపకుడు సుంకె కిష్టయ్య, మండల ఎస్‌సీసెల్ అధ్యక్షుడు డబ్బ బాపు, స్థానిక సర్పంచ్ సోల్ల



శంకరమ్మ బాపు, కౌటాల సర్పంచ్ వాజ్జెల మౌనీష్, కార్యక్రమం నిర్వాహకులు ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, డబ్బ గోపాల్, భిట్టుపెల్లి సంతోష్, బండి శ్రీనివాస్, యువజన సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలంపాట విజయవంతం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రాజీవ్ స్వగృహ లే అవుట్‌లోని ఇంటి స్థలాల ప్రత్యక్ష వేలం పాటను విజయంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్. అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అగ్రజ టౌన్‌షిప్‌లో మిగిలిపోయిన 58 ప్లాట్లకు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ స్వగృహ లే అవుట్ ప్రత్యక్ష వేలం ప్రక్రియను దరఖాస్తుదారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో విజయవంతం చేయడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ అగ్రజ టౌన్‌షిప్‌లోని రాజీవ్ స్వగృహ ఇళ్ల స్థలాలకు గతంలో నిర్వహించిన వేలంపాటలో డబ్బులు చెల్లించని కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి 58 ప్లాట్లకు వేలంపాట నిర్వహించామని తెలిపారు. ఈ రోజు నిర్వహించిన వేలంపాటలో 115 మంది దరఖాస్తుదారులు పాల్గొన్నారని తెలిపారు. ఇప్పటి వరకు (రాత్రి 8 గంటల వరకు) 53 ప్లాట్లకు వేలంపాట నిర్వహించిన దానిలో అత్యధికంగా గజానికి రూ.17,200 ధరతో, అత్యల్ప ధర గజానికి రూ.8,100తో ప్లాట్లను దరఖాస్తుదారులు సొంతం చేసుకున్నారని తెలిపారు. ఇంటిస్థలాలను సొంతం చేసుకున్న వేలంపాటదారులకు ప్లాట్ల కేటాయింపు పత్రాలను కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మహేశ్వర్, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ శాఖ నోడల్ అధికారి బసవేశ్వర్, తహసీల్దార్లు ఇమ్రాన్ ఖాన్, సతీష్, సంధ్యారాణి, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, నలంద ప్రియా, టౌన్ ప్లానింగ్ అధికారి సాయికిరణ్, టీఎస్ఐఐసీ జేఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

2024 నాటికి నెట్ జీరో ఎనర్జీ సంస్థగా సింగరేణి

- 450 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- 700 మిలియన్ యూనిట్లకు చేరనున్న సింగరేణి సోలార్ పవర్

నవతెలంగాణ-జైపూర్

2024వ సంవత్సరానికి సింగరేణి సంస్థ తాను వినియోగించే విద్యుత్‌కు సమానంగా సోలార్ విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేస్తూ నెట్ జీరో ఎనర్జీ సంస్థగా అవతరించనుంది. ఈ మేరకు సంస్థ ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని, 2024 నాటికి ఏడాదికి తాను వినియోగిస్తున్న విద్యుత్తుకు సమానంగా 700 మిలియన్ యూనిట్లు సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ మైలురాయిని చేరుకోనుందని సంస్థ సీఎండీ శ్రీధర్ పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ శుక్రవారం ఢిల్లీ నుండి నిర్వహించిన దేశవ్యాప్త బొగ్గు కంపెనీల సమీక్ష సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. సింగరేణి సంస్థ తన 42 గనులు 43 వేల మంది కార్మికుల కాలనీల అవసరాల కోసం ప్రతి ఏడాది 700 మిలియన్ యూనిట్ల విద్యుత్తును తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో నుండి కొనుగోలు చేస్తూ వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యుత్ ఖర్చులను పూర్తి స్థాయిలో తగ్గించుకోవడం కోసం సింగరేణిలో సోలార్ విద్యుత్తు ప్లాంట్లను పెద్ద ఎత్తున నెలకొల్పడం జరుగుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా పర్యావరణహిత చర్యగా ఇప్పటి వరకు 224 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను సింగరేణి వ్యాప్తంగా నెలకొల్పి ఏడాదికి 350 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తోందని, తద్వారా ఇప్పటికే సింగరేణి వినియోగిస్తున్న విద్యుత్‌లో 50 శాతం ఆదా చేకూరుతోందని వెల్లడించారు. 2024 నాటికి సింగరేణి వినియోగిస్తున్న మొత్తం 700 మిలియన్ యూనిట్ల విద్యుత్తుకు సమానంగా సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. మొదటి దశలో నిర్దేశించుకున్న 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్లలో ఇంకా మిగిలివున్న 76 మెగావాట్ల ప్లాంట్లను ఈ ఏడాది జూన్ చివరికల్లా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తద్వారా మరో 120 మిలియన్ యూనిట్ల సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తున్నట్లు తెలిపారు. రెండవ దశలో మరో 150 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను భూపాల్‌పల్లి, మందమర్రి ఏరియాల్లో మరో ఏడాదిలోగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, వీటి నుండి మరో 230 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్లాంట్లు 2024 నాటికి పూర్తి అవుతాయని, సింగరేణి సంస్థ తన విద్యుత్ అవసరాలకు తగిన విధంగా 700 మిలియన్ యూనిట్ల వార్షిక సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేసే స్థాయికి చేరుతుందని తెలిపారు.

విద్యార్థులకు స్వల్ప గాయాలు

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని నాగపూర్ గ్రామ సమీపంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో ప్రయాణిస్తున్న టాటా ఏసీ వాహనం శుక్రవారం బోల్తా పడింది. వాహనంలో ఉన్న నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగ్రెజ్‌పల్లి గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో బిరెల్లి, అస్నాద గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతి రోజు టాటా ఏసీలో వస్తుటారు. శుక్రవారం పాఠశాలకు సెలవు అయ్యాక ఇంటికి వెళుతున్న క్రమంలో నాగపూర్ ఏరా చెరువు సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలో ఉన్న అస్నాద్ గ్రామానికి చెందిన మోరే శ్రేయాస్, కొల్లూరి అచ్యుత్, కుంట అభినయశ్రీ, సుల్తానాకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామస్తులు స్థానికంగా ఉన్న వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం అందించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించారు.

సీతారాముల కల్యాణ తలంబ్రాల కౌంటర్

నవతెలంగాణ-నిర్మల్

సీతారాముల కళ్యాణ తలంబ్రాల ప్రత్యేక కౌంటర్‌ను బస్టాండ్‌లో డిపో మేనేజర్ ఎస్.సాయన్న శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 30న జరగనున్న శ్రీరామ నవమిని పురస్కరించుకుని భద్రాద్రి శ్రీరాముల కల్యాణ మహోత్సవానికి వెళ్లలేకపోతున్న వారికి ఆర్టీసీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ తలంబ్రాలు కార్గో ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. నిర్మల్ బస్‌స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రూ.116 చెల్లిస్తే సీతారాముల కళ్యాణం అనంతరం ఇంటి వద్దకే కల్యాణ తలంబ్రాలు తెచ్చి ఇస్తామని తెలిపారు. ప్రత్యేక కౌంటర్‌లో రూ.116 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్‌లు రాజశేఖర్, శ్రీకర్, కార్గో ఎగ్జిక్యూటివ్ కిషోర్‌కుమార్, స్టేషన్ మేనేజర్‌లు మోహన్, మహేందర్‌రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ సురేందర్, ప్రసాద్, డి.గంగన్న పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని బాబాసాగర్ గ్రామంలో శుక్రవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని జిల్లా బాలల సంరక్షణాధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి బుర్ర మహేష్, చైల్డ్ లైన్ ఇన్చార్జి ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్, పంచాయతీ కార్యదర్శి శంకర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకే పట్టం

నవతెలంగాణ-భీమారం

పశ్నించే గొంతుకకే ఉపాధ్యాయులు పట్టం కట్టారని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు సయంపు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చెన్నూర్ సరస్వతీ శిశుమందిర్‌లో తపస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మార్చి 13న జరిగిన మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోసం ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికలలో పెద్ద సంఘాలను సైతం వెనక్కి నెట్టి తపస్ బలపరిచిన ఏవిఎన్ రెడ్డి గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు. నిరంతరం పోరాటం చేస్తూ పండితులు, పీఈటీల ఉన్నతీకరణ, పిఆర్‌సి ఎరియర్స్, డిఏలు, జిపిఎఫ్‌లోన్లు, మెడికల్ బిల్లులు పెండింగ్ ఉపాధ్యాయులను తీవ్ర మనోవేదనకు గురి చేశాయన్నారు. జాతీయవాద భావాలున్నా తపస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించడంతో ఉపాధ్యాయులు మార్పును కోరుకున్నారని స్పష్టమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కొట్టె నాగరాజు, సింగిరెడ్డి సాంబయ్య, అడిచర్ల రాజ్‌కుమార్, మండల నాయకులు నూకల సురేష్, రాజేందర్, చకినారపు ప్రవీణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో శుక్రవారం కుక్కలు స్వైర్య విహారం చేశాయి. మండల కేంద్రంలోని హనుమాన్ కాలనీలో బాలుడుని, మహాలక్ష్మి కాలనీలో బాలికను కుక్కలు గాయపర్చాయి. మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైందని, వాటి బారి నుండి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఫోటో : 17 కెజెడ్ఆర్ 01 : ఆలయంలో పూజలు చేపడుతున్న భక్తులు

పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ 21వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య దీపారాధన, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, కలశ స్థాపన, చండీహోమం, సహస్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం పడిపూజ, భజన, మహాహారతి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గణేష్‌నాయర్, ఎనగంటి భిక్షపతి, గురుస్వాములు జయకుమార్ నాయర్, నాగేందర్, పోతురాజుల రమేష్, రవీంద్రాచారి, గడ్డం శ్రీనివాసాచారి, సోని, శ్రీనివాస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఐఎఫ్టీయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-తాండూర్

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 9వ మహాసభలు ఈనెల 25, 26, 27. తేదీల్లో మంచిర్యాలలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ చాంద్‌బాషా తెలిపారు. మండలంలోని మాదారం టౌన్ షిప్‌లో పోస్టర్లు విడుదల చేశారు. ఈ మహాసభలకు ప్రజలు పెద్ద మొత్తంలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సులబ్ వర్కర్స్ యూనియన్ డివిజన్ నాయకుడు శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు, నాందేవ్, శకుంతల, పోశక్క, ఓదమ్మ, మల్లేశ్వరి, లక్ష్మి యశోద, లచ్చయ్య పాల్గొన్నారు.

గుండి వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండల పరిధిలో నిర్మిస్తున్న గుండి వాగు వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న గుండి వంతెన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం వర్షాలలో పిల్లర్ల పైనుండి వరద నీరు వెళ్లడంతో కొంతమేర దెబ్బతిన్నాయని, వంతెన నిర్మాణాన్ని రీ డిజైన్ చేసి నూతనంగా రీ టెండర్ ప్రక్రియ నిర్వహించి నూతన గుత్తేదారులకు పనులు అప్పగించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాలను కలుపుతూ ప్రజలకు ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు వంతెన నిర్మాణం జరుగుతుందని, జూన్ 15వ తేదీలోగా నిర్మాణ పనులు పూర్తిచేసే విధంగా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఈఈ రామ్మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, మాజీ ఎంపీటీసీ రవీందర్ పాల్గొన్నారు.